క్లుప్తంగా

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

వాల్మీకిపురం: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. ఉమా అమరేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో జీఎఫ్‌సి (జనరల్ ఫౌండేషన్ కోర్స్), ఎంఎల్‌టి (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) ఒకేషనల్ గ్రూపు సబ్జెక్టులను బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి వారి అర్హత ధృవీకరణపత్రాలు, అనుభవ సర్టిఫికెట్లతో ఈ నెల 21వ తేది సోమవారం ఉదయం 10గంటలకు కళాశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

ఆలయానికి విరాళం

ములకలచెరువు: మండలంలోని పర్తికోటలో వెలసిన శ్రీ మారెమ్మ ఆలయానికి మండలానికి చెందిన పారిశ్రామిక వేత్త జయచంద్రారెడ్డి , మంత్రి గిరిధర్‌రెడ్డి శుక్రవారం విరాళాన్ని అందించారు. ఆలయ గోపురం నిర్మాణానికి రూ. 1.50 లక్షల విరాళం అందించినట్లు చెప్పారు.

ఎఫ్‌పీఓ అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి

బి.కొత్తకోట: మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎస్.రాజశేఖర్ రెడ్డిని రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఎఫ్‌పీఓ సంఘ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మురళి మాట్లాడుతూ ఎఫ్‌పీఓ ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు, వసూళ్లు, చేపట్టిన పనులను వివరించారు. అనంతరం నిర్వహించిన ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా సోమశేఖర్, కార్యదర్శిగా ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా రవీంద్రరెడ్డి, కోశాధికారిగా జాకీర్ సహా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పరుగు పందెంలో విశేష ప్రతిభ


సిద్ధార్థ

పీలేరు : పీలేరుకు చెందిన గుర్రం నారాయణ కుమారుడు గుర్రం సిద్ధార్థ పరుగు పందెంలో విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గుర్రం సిద్ధార్థ మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్ ఎంపీసీ చదువుతున్నాడు. ఇటీవల దక్షిణ భారత స్థాయిలో జరిగిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలలో పాల్గొని 100 మీటర్లు, 200 మీటర్లు పరుగుపందెంలో ప్రథమ స్థానం సాధించాడు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సిద్ధార్థ మాట్లాడుతూ తాను పరుగు పందెంలో రాణించడానికి వ్యాయామ ఉపాధ్యాయులు జి. సురేంద్రరెడ్డి సూచనలు, సలహాలు, సహకారం దోహదపడ్డాయని తెలిపారు.

వేరుశనగ పంటలో బెట్టనివారణ

నిమ్మనపల్లె : వేరుశనగ పంటలో బెట్ట నివారణకు రైతులు తగుచర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ అన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులు ప్రధానంగా సాగుచేసిన వేరుశనగ పంట వర్షాభావ పరిస్థితులతో బెట్టకు గురై ఎండుముఖం పడుతోందన్నారు. బెట్ట నివారణలో భాగంగా ఒక లీటరు నీటికి 20 గ్రాముల యూరియా కలిపి ద్రావణంగా తయారుచేసుకుని పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా పంట వారం పదిరోజుల పాటు వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుందని సూచించారు.

కరెంటుషాక్‌తో విద్యార్థికి గాయాలు

మదనపల్లె : ఇంట్లో సంపునకు నీళ్లు పడుతుండగా, స్టార్టర్‌కు కరెంటు సరఫరా జరగడంతో కరెంట్‌షాక్ కొట్టి విద్యార్థి గాయపడ్డాడు. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... తంబళ్లపల్లె మండలం రెడ్డికోట పంచాయతీ కలపోల్లపల్లెకు చెందిన రైతు మోహన్‌రెడ్డి కుమారుడు ఆర్.కిరణ్‌కుమార్‌రెడ్డి(19) డిగ్రీ చదువుతున్నాడు. శుక్రవారం తల్లిదండ్రులు వ్యవసాయపనులపై పొలంవద్దకు వెళ్లడంతో ఇంటిపట్టునే ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి సంపునకు నీళ్లు పడుతుండగా, ప్రమాదశాత్తు స్టార్టర్‌కు కరెంటు సరఫరా జరిగి షాక్ కొట్టడంతో గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది.

పేద విద్యార్థుల అభివృద్ధికి చేయూత

పీలేరు రూరల్ : మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎనమలవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పది మంది విద్యార్థులకు ఉమ్మడి చిత్తూరు బయోస్టాట్ కంపెనీ చేయూతనిచ్చింది. శుక్రవారం బయోస్టాట్ కంపెనీ రీజనల్ మేనేజర్ జి. నాగరాజ పదో తరగతి విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ. 2500 చొప్పున మొత్తం రూ. 25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కంపెనీకి వచ్చిన లాభంలో కొంత రైతుల పిల్లల విద్యాభివృద్ధికి సాయమందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, రెడ్డెప్పరెడ్డి, మస్తాన్ సాహెబ్, శ్రీధర్‌బాబు, అమరనాథరెడ్డి, వెంకటరమణ, మునిరాజ పాల్గొన్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- ప్రజావిశ్వాసం కోల్పోయి మనుగడ కోసం ఆరాటపడుతున్న టీడీపీ


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైతులు, పేదలపై మాట్లాడే అర్హత నైతికత టీడీపీకి లేదని వైఎస్సార్ సీపీ కర్నూలు, అన్నమయ్యజిల్లా రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్‌లను కలిశారు. మండలంలో జరుగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనానంతరం ఎమ్మెల్యేతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..40 సంవత్సరాల పరిపాలన అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు ఆయన అధికారంలో ఉన్న 1994–2004 కాలంలో ఎటువంటి ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టారని ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్ట్ కూడా చేపట్టకపోగా, అప్పటి ప్రతిపక్ష నాయకులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత కరెంట్ ఇస్తామంటే, రైతుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా కరెంటుతీగలపై బట్టలు ఆరేసుకోవాలంటూ చంద్రబాబునాయుడు ఎద్దేవా చేశారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంటుతో పాటు జలయజ్ఞం పేరుతో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రైతులు, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయనకు మించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో వడివడిగా అడుగులు వేస్తున్నారన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని చెప్పుకుంటూ గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళుతుందన్నారు. ప్రతిపక్ష పార్టీకి తాము చేసింది చెప్పుకోలేక, ప్రజలను మోసం చేసేందుకు, రాజకీయ మనుగడ కాపాడుకునేందుకు తాపత్రయపడుతోందన్నారు. డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసంచేసి డిఫాల్టర్లుగా మార్చితే జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చిన మేరకు రుణమాఫీ చేయడంతో పాటు సున్నా వడ్డీని అమలు చేస్తున్నారన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శన కోసం అంగళ్లు, పుంగనూరుకు వచ్చిన చంద్రబాబు రెచ్చగొట్టే ప్రసంగాల ద్వారా అశాంతిని సృష్టించి, పార్టీని నిలబెట్టాలనుకుంటున్నారన్నారు. టీడీపీ నాయకుల మాటలు విని కార్యకర్తలు కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. లోకేష్ కార్యకర్తలు ఎన్ని కేసుల్లో ఉంటే అంతగా గుర్తిస్తామనడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. 2019 కంటే మెరుగైన ఫలితాలతో 2024 ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నాయకత్వం మదనపల్లె ప్రజలకు ఎంతో అండగా ఉందన్నారు. ఏ పార్టీకైనా కార్యకర్తలు, నాయకులు పట్టుగొమ్మలని, రానున్న ఎన్నికల్లో మీరంతా కలిసికట్టుగా పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీబీపీ ఆధ్వర్యంలో మెగా ప్లానిటేషన్


సీకాం కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఐటీబీపీ అధికారులు, జవాన్‌లు

కలికిరి: ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్(ఐటీబీపీ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో చేపట్టిన ఒక్క రోజు మెగా ప్లానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా కలికిరి 53వ ఐటీబీపీ బెటాలియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ప్లానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కేంద్రం కమాండెంట్ అమిత్ భాటి ఆధ్వర్యంలో స్థానిక ఐటీబీపీ క్యాంప్ ఆవరణ, రాజువారిపల్లి వద్ద నున్న సీకాం విద్యా సంస్థల ఆవరణలో వివిధ రకాల 2425 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటి బాధ్యత తీసుకుని పెంచాలన్నారు. ఇందుకు ఐటీబీపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఒక్క రోజులో నాలుగు లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మొక్కలు విరివిగా నాటామన్నారు. విద్యార్థులు కూడా నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమాలలో డిప్యూటీ కమాండెంట్ ఆశిష్ కుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు రంజన్‌కుమార్(ఇంజనీరింగ్), డాక్టర్ స్వప్న, సీకాం విద్యాసంస్థల చైర్మెన్ డా.టి.సురేంద్రనాథరెడ్డి, ఇన్స్‌పెక్టర్‌లు వైవీ రెడ్డి, దీపక్, ఐటీబీపీ జవాన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

దాతల ఔదార్యంతో ఆర్థికసాయం


అనిత పిల్లలకు డిపాజిట్‌బాండ్లు అందజేస్తున్న దాతలు

తంబళ్లపల్లె: మండలంలో టీటీడీ ఆధ్వర్యంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో ఔట్‌సోర్సింగ్ ప్రధాన అర్చకులుగా రాఘవేంద్రస్వామి (26) స్వామివారికి సేవలు అందిస్తూ గత నెలలో అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడకి భార్య అనిత, ఏడు సంవత్సరాల కుమారుడు పవన్‌క్రిష్ణమాచార్యులు, ఐదేళ్ల కుమార్తె చిన్మయి ఉన్నారు. ఆ పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు కోసువారిపల్లెదాతలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మెడికల్‌షాపు రాజారెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ రమణారెడ్డి, సదాశివారెడ్డి, పలువురు దాతలవద్ద సేకరించిన మొత్తాన్ని అనిత కుమారుడు, కుమార్తెల పేరుపై ఒక్కొక్కరి పేరున రూ.1.10ల చొప్పున అంగళ్లు ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేశారు. వారిని శుక్రవారం కోసువారిపల్లెకు పిలిపించి బ్యాంకు డిపాజిట్ బాండ్లను అందజేశారు. అనితకు మరో రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. వారి దాతృత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రతి ఇంటికి వెళ్లారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిమెంట్ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే స్థానిక సమస్యలను పరిష్కరించేలా అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత మూడునెలలుగా నిమ్మనపల్లె మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లామన్నారు. నాలుగున్నర సంవత్సరాల వైఎస్సార్ సీపీ పాలనలో అనేక సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో లాగా భూకబ్జాలు, అవినీతి, కమిషన్ ఏజెంట్లు లేకుండా స్వచ్ఛమైన పరిపాలన అందించామన్నారు. అందుకు నిదర్శనంగా తాము ఏ గ్రామంలోకి వెళ్లినా బ్రహ్మరథం పట్టారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు అన్నివిధాలుగా సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయప్రకాష్ రెడ్డి, సర్పంచులు సుబ్రహ్మణ్యం, ఉషారాణి, చెంద్రాయుడు, మహదేవరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు విజయకుమార్‌రెడ్డి, యుగంధరరెడ్డి, నరేంద్రరెడ్డి, శశిధరరెడ్డి, నవీన్‌చంద్ర, హోటల్‌రఫీ, వసీం, దావూద్, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకోవాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రమశిక్షణ,సేవా భావం అలవర్చుకోవాలని మదనపల్లె డీవైఈఓ కృష్ణప్ప అన్నారు. శుక్రవారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ చతుర్థ చరణ్ ట్రైనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. పాఠశాలల్లో స్కౌట్స్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని మంచి పేరు తీసుకువస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, ఏఎస్‌ఓసి కోటేశ్వరరావు, క్లబ్ మాస్టర్స్ చంద్రశేఖర్, భూపతి, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలకు స్మశానవాటికలు ఏవీ?


సమస్యలు తెలియజేస్తున్న ఎస్సీ, ఎస్టీ నాయకులు

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితుల పక్షపాతిగా ప్రతి దళితవాడకు విధిగా స్మశాన వాటిక చూపాలని ప్రభుత్వం జీఓ విడుదల చేసినా గ్రామీణ దళితవాడలలో అమలుకు నోచుకోలేదని దళిత సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రదీప్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సమావేశంలో వారు పాల్గొని సమస్యలను తెలియజేశారు. మండలంలోని ఎర్రకోటపల్లె, కె.మాదిగపల్లె, యల్లంకివారిపల్లె హరిజనవాడ, ఎర్రకోటపల్లె హరిజనవాడ,దేవులపల్లె, కోన, బాలయ్యగారిపల్లె, కలకడ యానాదికాలనీ వాసులకు పూర్తిగా స్మశానవాటికలు లేక మృతదేహాలను ఖననం చేయడానికి పడరానిపాట్లు పడుతున్నట్లు తెలిపారు. ఎర్రకోటపల్లెలో డీకేటీ భూములు ఉన్నా రెవెన్యూశాఖ అధికారులు చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, చంద్రయ్య, నరసింహులు, నాగన్న, మల్లికార్జున, రమణ పాల్గొన్నారు.

రెన్యువల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు రూరల్ : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 2022–23 విద్యాసంవత్సరంలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 2023–24 విద్యా సంవత్సరానికి గాను తమ సర్వీసును రెన్యువల్ చేసుకోవాలని జిల్లా ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెన్యువల్ దరఖాస్తులు ఈ నెల 20వ తేదీలోపు పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని కోరారు.

శ్రీశైలం తరహాలో మల్లయ్యకొండ అభివృద్ధి


మల్లయ్యకొండపై కనుగొండ మద్దిరెడ్డి కుటుంబీకులు

తంబళ్లపల్లె: పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల కృషి ఫలితంగా శ్రీశైలం తరహాలో మల్లయ్యకొండ దినదినాభివృద్ధి చెందడం హర్షణీయమని ఆలయ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి అన్నారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో మల్లయ్యకొండను సందర్శించారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు కనుగొండ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గౌరమ్మగుట్టలో వెలసిన గౌరమ్మతల్లికి ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. చారిత్రాత్మకమైన మల్లయ్యకొండ శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని పునఃనిర్మించడం, రోడ్డు నిర్మించడం చరిత్రలో మరువరానిదన్నారు. రోడ్డు సౌకర్యంతో సుదూర ప్రాంతాల నుండి భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబీకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ


ఆవులపల్లెలో రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్

మదనపల్లె : మండలంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందని జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ ఆవులపల్లెలో జరుగుతున్న రహదారి పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ గ్రామీణ రహదారుల అభివృద్ధి పథకంలో భాగంగా మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా కృషితో మదనపల్లె మండలంలోని అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి రూ.40 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. వాటికి సంబంధించి పనులు జరుగుతున్నాయని, త్వరలోనే మండలంలోని అన్ని గ్రామాలకు రహదారులు అందుబాటులోకి వస్తాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మదనపల్లె మండలంలోని అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణాలు జరగడంపై ప్రజల తరపున మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మదనపల్లె సిటీ: జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలకు సంబంధించి పెండింగ్ పనులను సంక్షేమ,విద్యా సహాయకులు త్వరితగతిన క్లియర్ చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి జాకీర్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం మదనపల్లెలో సంక్షేమ అధికారులు, విద్యాసహాయకులకు విద్యాదీవెన, వసతిదీవెన పథకాలపై డేటా ప్రాసెసింగ్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన పథకాలపై పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మదనపల్లె ఏఎస్‌డబ్ల్యూ శ్రీరాములునాయక్, డిపిఎం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి యూనిఫాం

పీలేరు : పీలేరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్‌కు యూనిఫాం పంపిణీ చేసినట్లు సీడీపీవో రాజమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో ఒక్కొక్కరికి రెండు చీరలు చొప్పున స్త్రీ, శిశుసంక్షేమ శాఖ తరఫున అందజేశారు. సూపర్‌వైజర్లు శాంత, అన్నపూర్ణ, భారతి, ఉమా, స్వర్ణ, స్వరూప, శంకరమ్మ, యశోద పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో వినియోగదారుల క్లబ్‌లు

- వినియోగదారుల రక్షణ కోసం నూతన చట్టం
- పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలి
- జిల్లా డీసీఎస్ఓ రఘురాం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ షమీంబాషా


వినియోగదారుల క్లబ్‌ల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారి డాక్టర్ షమీంబాషా

మదనపల్లె : వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా సమస్య ఎదురైతే ఎలా పరిష్కరించుకోవాలి, ఎవరిని కలవాలి, దీనికోసం పనిచేసే సంస్థలు ఏంటి అనే విషయాలపై అవగాహన కలిగించేందుకు విద్యాసంస్థల్లో కన్సూమర్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి కే.రఘురాం, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్.షమీంబాషా అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కన్సూమర్ అఫైర్స్, ఫుడ్, సివిల్ సప్లయిస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో స్కూల్ కన్సూమర్ క్లబ్స్ ఏర్పాటుపై జిల్లాస్థాయి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ రఘురాం, ఎఫ్ఎస్ఓ షమీంబాషా, లీగల్‌మెట్రాలజీ నాగరాజు, డీవైఈఓ కృష్ణప్ప ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తెలివైన కొనుగోలు పద్ధతి, వినియోగదారు విద్య, సైబర్ క్రైమ్, వినియోగదారుల రక్షణ చట్టం–2019 తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వినియోగదారుల రక్షణ చట్టంలోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వినియోగదారుడు ఏ వస్తువు కొన్నా, ఏ సేవ పొందినా అది వినియోగదారునికి ఉపయోగపడాలే కానీ హాని కలిగించరాదని, వాటివల్ల పూర్తి భద్రత ఉండాలన్నారు. అలా పొందని పరిస్థితిలో చట్టప్రకారంగా వినియోగదారునికి నష్టపరిహారం పొందే హక్కు ఉందని తెలిపారు. వినియోగదారుల వివాదాలను పరిష్కరించేందుకు జాతీయ,రాష్ట్ర, జిల్లా స్థాయిలలో మూడంచెల పద్ధతిలో మూడు కమిషన్లు ఉన్నాయన్నారు. ఉత్పత్తిచేసిన వస్తువుల పట్ల బాధ్యత లేని సంస్థలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ–కామర్స్, ఆన్‌లైన్ అమ్మకాలు, కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు అరికట్టడం జరుగుతుందన్నారు. నకిలీ వస్తువుల విక్రయంపై జరిమానా విధించడం, అన్యాయమైన వాణిజ్య పద్ధతులను, తప్పుదోవ పట్టించే ప్రకటనలను అరికడతామన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం–2019పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ప్రతి హైస్కూల్‌లో 8, 9 తరగతి విద్యార్థులతో ఒక కన్సూమర్ క్లబ్‌ను ప్రారంభించాలన్నారు. దీని నిర్వహణకు ఒక ఉపాధ్యాయుడిని నియమించి, ఆయన ఆధ్వర్యంలో ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసి, వినియోగదారులకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ పవన్‌కుమార్, షఫీవుల్లా, ఎంపీడీఓ భానుప్రసాద్, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, సివిల్‌సప్లయిస్ డీటీ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : రాష్ట్రంలో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు విరాజిల్లుతున్నాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక చెన్నారెడ్డి వీధి, పద్మావతి నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వివరాలు చదివి వినిపించారు. ఇంకా ఏవైనా పథకాలు అందాల్సి ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎక్కడికి వెళ్లినా ప్రధానంగా మహిళలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. మరోసారి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారని తెలిపారు. తమకు లభిస్తున్న ప్రజాదరణతో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ఉత్సాహంతో ముందుకు వెలుతున్నామని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, దీన్ని ప్రజలు తిప్పికొట్టాలని పేర్కొన్నారు. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మహితాఆనంద్, వైస్ ఎంపీపీలు హరిత, ఎస్.వి. చలపతి, నాయకులు చక్రధర్, అనురాధ, సపూరా, అరుణ, ప్రభావతి, సచిన్, హుమయూన్, కాలేషా, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, కాలనీ చిన్న, షాకీర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


పట్టుబడిన కర్ణాటక మద్యం, నిందితులు

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం ఉదయం అరెస్ట్ చేశామని మదనపల్లె సెబ్ సీఐ శ్రీహరిరెడ్డి చెప్పారు. ఆయన కథనం మేరకు వివరాలు..బి.కొత్తకోట మండలం చలిమామిడికి చెందిన యు.రెడ్డెప్ప (39), యు.ఉత్తన్న (37)లు కర్ణాటక మద్యాన్ని దిగుమతి చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించుకునే వారికి సరఫరా చేస్తుంటారు. శుక్రవారం కర్ణాటకలోని రాయల్పాడు నుంచి మద్యం బాక్సులను తీసుకొచ్చి రెడ్డెప్ప, ఉత్తన్నలకు అందజేశాడు. వీరిద్దరూ గట్టుకు చెందిన పలక శ్రీనివాసులు (43), తేట అంజప్ప (43), పాకాల రమణ (63)లతో కలిసి కర్ణాటక మద్యం విక్రయించేందుకు తీసుకెళ్తుండగా గట్టు చెరువుకట్ట వద్ద దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. వీరు తరలిస్తున్న ఏడు బాక్సుల్లోని కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామని అందులో 672 ప్యాకెట్ల మద్యం ఉన్నట్లు తెలిపారు. నిందితులను మదనపల్లె కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది హరికుమార్, త్రిపురేంద్రుడు, దామోదర్, ప్రసన్నకుమార్, లవకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే పల్లెబాట లక్ష్యం


బూచిపల్లిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు, నాయకులు

పెద్దతిప్పసముద్రం: ప్రజా సమస్యలను పరిష్కరించడమే పల్లెబాట లక్ష్యమని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని బూచిపల్లిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పర్యటించారు. పలు చోట్ల సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలని, రైతు భరోసా, పక్కా గృహాల బిల్లులు మంజూరు కాలేదని పలువురు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వచ్చారు. సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. గడప, గడపకూ వెళ్ళి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ పల్లెబాటకు శ్రీకారం చుట్టారు. నాయకులు శ్రీరాములురెడ్డి, కిట్టన్న, రియాసత్‌అలీఖాన్, కుమార్‌రెడ్డి, పోతుపేట వెంకటేష్, గణపతిరెడ్డి, వెంకట్, చెట్లవాండ్లపల్లి వెంకట్ రెడ్డితో పాటు అధికారులు గిరిధర్‌రెడ్డి, విద్యాసాగర్, ఉత్తన్న, ప్రేమలత, హరి, మహేష్, శ్రీనివాసులు, ఖాజా మొహిద్దీన్, నాగరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సంపతికోటలో పల్లెబాట

మండలంలోని సంపతికోట పంచాయతీలో శనివారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చేపట్టిన కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన సూచించారు.

పెయ్యదూడల పెంపకంలో మెలకువలు


పెయ్య దూడలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

కలికిరి: పాడి రైతులు పెయ్య దూడల పెంపకంలో మెలకువలు పాటిస్తే అవి ఆరోగ్యకరంగా ఎదుగుతాయని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై అన్నారు. మండలంలోని మర్రికుంటపల్లిలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పెయ్య దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పెయ్య దూడల కోసం లింగ క్రమబద్ధీకరించిన యెద సూదులు వేయించుకోవాలని, దూడలకు బ్రూసెల్ల వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల అభివృద్ధికి రాయితీతో గడ్డి విత్తనాలు, గడ్డికత్తిరింపు యంత్రాలు, ఇతర సదుపాయాలు కల్పిస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 50 పెయ్య దూడలు ప్రదర్శనకు రాగా వాటిలో మంచి ఆరోగ్యకరంగా, పుష్టిగా ఉన్న మొదటి మూడు దూడలను ఎంపిక చేసి సంబంధిత రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. అనంతరం మండలంలో మంది రైతులకు మంజూరైన 28 గడ్డికత్తిరింపు యంత్రాలను పంపిణీ చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ బాలసుబ్రమణ్యం, ఏడీఏ వెంకటమునినాయుడు, మండల పార్టీ కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, పశువైద్యాధికారి గిరినాథ్, సర్పంచ్ రెడ్డిరాము పాల్గొన్నారు.